తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఘనంగా బంగారు నెమలి వాహనంకు కరిగోల పూజ

-కోటి రూపాయలతో నూతన నెమలివాహనం ఏర్పాటు

కాణిపాకం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఊరేగేందుకు ఉభయదారులైన రెడ్డి వంశస్థులు నూతనంగా తయారు చేసిన బంగారు నెమలివాహనంకు శుక్రవారం కరిగోల పూజను అత్యంత ఘనంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెమలివాహన ఉభయదారులైన రెడ్డి వంశస్థులు సుమారు కోటి రూపాయల వ్యయంతో నూతన బంగారు నెమలివాహనంను ప్రత్యేకంగా తయారు చేయించారు. ఈనెమలివాహనంకు శుక్రవారం మధ్యాహ్నం కరిగోల పూజను నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నూతన బంగారు నెమలివాహనంకు దిష్టి తగలకుండా నల్లటి వస్త్రాన్ని ధరింపజేసి అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. దీనితో గ్రామస్థులు నెమలివాహనంకు ఎర్రనీళ్ళతో దిష్టితీశారు. అనంతరం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఉభయదారులు ప్రత్యేక పూజలు చేసి నెమలివాహనంను ప్రారంభించారు. ఈనూతన నెమలివాహనంను రాష్ట్రమంత్రి



చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఉభయదారులైన రెడ్డి వంశస్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు పాలడైరీకి మోక్షం లభిస్తుందా!

## -అమూల్‌సంస్థ ప్రతినిధుల పరిశీలనతో రైతుల్లో చర్చ



ప్రభాతవార్త-తిరుపతి/చిత్తూరు:

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో వెలుగువెలిగిన విజయ సహకార పాల డైరీని మళ్ళీ తెరిపిస్తారా?,పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా! అనే చర్చ చిత్తూరు జిల్లాలోని రైతాంగంలో మొదలైంది. దాదాపు రెండుదశాబ్ధాల క్రిందట చిత్తూరు పాలడైరీ మూతబడింది. అప్పట్లోనే డైరీని తెరిపించేందుకు పలువురు రైతులు ,రైతు సంఘం నాయకులు తీవ్రస్థాయిలో కృషి చేశారు.అయితే నష్టాలపేరుతో పాడిరైతులకు బకాయిలు కూడా చెల్లించకుండా అర్ధాంతరంగా మూసివేశారు. చిత్తూరు సహకార పాలడైరీ నడిచేరోజుల్లో అప్పట్లోనే రోజుకు 40లక్షల లీటర్ల పాలు సేకరించేదని అధికారిక సమాచారం. ఆ తరువాత జిల్లాలోని రైతులు పలు ప్రైవేటు డైరీలపై మొగ్గుచూపాల్సి వచ్చింది. ఇప్పటికీ ఈ సహకార డైరీని తెరిపించి రైతులకు గిట్టుబాటు పాల ధర ఇవ్వాలనే ఆశయంతో రైతులు కోరుతున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా గతంలో ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో ప్రజాసంకల్పపాదయాత్రలో చిత్తూరు సహకార పాలడైరీకి మంచిరోజులు తీసుకువస్తామని హామీ ఇచ్చారనేది రైతులు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రిందట చిత్తూరు సహకార పాలడైరీని టిటిడి స్వాధీనం చేసుకుని తెరిపించి టిటిడికి అవసరమైన పాలు, నెయ్యి సేకరించడం కోసం స్వతహాగా తిరుమల శ్రీవారి ఆలయంకు అవసరమైన ప్రసాదాలు తయారీ, నైవేద్యాలు వినియోగించు కోవచ్చని అభిప్రాయం వ్యక్తంచేసింది. ఆ దిశగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి డైరీని నిర్వహించడానికి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డిపిఆర్) తయారు చేయాలని 2019 చివర్లో చర్చించారు. అయితే కరోనా కారణంగా ఈ ప్రతిపాదనలు చర్చకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం టిటిడి దేశవాళీ గోవులు 130వరకు సమీకరించి వాటినుంచి స్వతహాగా రోజుకు మూడువేల లీటర్ల వరకు స్వచ్ఛమైన పాలు సేకరించి పెరుగు, నవనీతం, నెయ్యి తయారు చేసుకుంటున్నారు. దీంతో ఈ ప్రతిపాదనలు అటకెక్కాయి. తాజాగా నాలుగురోజుల క్రిందట అమూల్‌పాలడైరీ ప్రతినిధులు చిత్తూరు సహకారపాల డైరీని పరిశీలించడంతో మళ్ళీ రైతులో సదాభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పాలడైరీని తెరిపించి జిల్లాలోని రైతులకు మంచిచేయాలని కోరుతున్నారు. ఏళ్ళ తరబడి మూతబడిన పాలడైరీని తెరిపించడమేగాక జిల్లాలో పాడిపరిశ్రమపై ఆధారపడిన రైతులను ఆదుకొంటారా అనే చర్చ మొదలైంది. మరి ఇది ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది మాత్రం చూడాల్సిందే.

## బంగారు నెమలి వాహనంపై...

# విహరించిన పార్వతీ పుత్రుడు



కాణిపాకం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ఉభయ దేవేరులతో కలసి పార్వతీ సుతుడు గణనాధుడు బంగారు నెమలివాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారికి నెమలివాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, చినకాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, అగరంపల్లె, వడ్రాంపల్లె, దామరకుంట, కురప్పల్లె, గ్రామాదుల రెడ్డి వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈకార్య క్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఉభయదారులతో కలసి స్వామివారికి ఉభయాన్ని తీసుకువచ్చి అందించారు. ఈమేరకు వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు నూతన ఆలయంలోని స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి శోభాయమానంగా అలంకరించి ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకారమండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ అర్చకులు అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన బంగారు నెమలివాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాల నడుమ ఘనంగా గ్రామ పురవీధుల గుండా ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, రమేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఉభయదారులైన రెడ్డి వంశస్థులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా జరిగే జనగణనలో..

# బిసి కులాలను లెక్కించాలి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త : దేశ వ్యాప్తంగా జరిగే జనగణనలో బిసి కులాలను కూడా లెక్కించాలని, కులగణాంకాలు చేయకపోతే జనగణను బహిష్కరిస్తామని, బిసిల కులగణనకు నేటి ప్రభుత్వాలు ఎందుకు భయపడుతున్నాయో తమకు వెంటనే సమాధానం చెప్పాలని రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుల కేసన.శంకరరావు అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కె.క్రాంతికుమార్, రాష్ట్రకోఆర్డినేటర్ బ్రహ్మనందశర్మ, జిల్లా ఉపాధ్యక్షులు జయచంద్ర, రాష్ట్ర ముదిరాజ్ సంఘ ఉపాధ్యక్షులు సురేంద్రముదిరాజ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళ గడుస్తున్నా ఇప్పటి వరకు ఏరాజకీయపార్టీలోను బిసిలకు సముచిత స్థానం లేదన్నారు. శాస్త్రీయంగా వెనుకబడిన కులాల వివరాలను సేకరించలేదని రాజకీయ పార్టీలన్నీ చట్టసభల్లో సీట్లు కేటాయింపులో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో బిసిలపై కపటప్రేమను చూపుతున్నాయన్నారు. తమను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప చట్టసభల్లో తమకు ఇవ్వాల్సిన రిజర్వేషన్లు ఇవ్వడం లేదన్నారు. దేశం మొత్తం 3వేలకుపైగా కులాలు ఉండగా ఇందులో 2,633 బిసి కులాలు ఉన్నా యని జనాభాలో బిసి కులాలు 52శాతం ఉన్నాయన్నారు. అయితే రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్యారంగాల్లో వీరి వాటా కేవలం 12 నుంచి 21శాతం మాత్రమే ఉందని సర్వేలు చెబుతున్నాయని ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ బిసిలకు రూ.10వేలకోట్ల ప్రత్యేక బడ్జెట్ అంటూ ప్రచారం చేస్తారే తప్ప ఆచరణకు నోచుకోలేదన్నారు. దేశంలో 22 రాజకీయ పార్టీలు మద్దతు ఓబిసి కులగణనకు మద్దతు తెలిపారని 8రాష్ట్రాల సిఎంలు కూడా తీర్మానం చేసి కేంద్రానికి పంపుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌ను కూడా కలసి ఓబిసి కులగణన చేయాలని విన్నవించామన్నారు. భవిష్యత్తులో బిపి మండల్ ప్రతిపాదనలు అమలుచేయాలని కోరారు. రానున్న రోజుల్లో రాజకీయాల్లో పెనుమర్పులు చోటు చేసుకోనున్నాయని త్వరలోనే కొత్తగా రాజకీయ పార్టీ ఏర్పాటుచేసి బిసిలను ఐక్యంగా ఒకవేదికపైకి తీసుకువస్తామన్నారు. రాజకీయపార్టీలన్నీ బిసిలపై శీతకన్ను వేసి తమను ఓటుబ్యాంకుగానే వాడుకుంటున్నారన్నారు. కార్పొరేషన్‌ఛైర్మన్‌లు కేవలం ఉత్సవవిగ్రహాలుగా మారారని విమర్శించారు. శ్రీకాళహస్తిలో త్వరలోనే బిసిల సభను ఏర్పాటు చేస్తామన్నారు. 2024లో ఎన్నికల ముందుగా రాజకీయ పార్టీని ఆవిష్కరిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్ బ్రహ్మనందశర్మ, జిల్లా ఉపాధ్యక్షులు జయచంద్ర, రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు సురేంద్రముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమృత్ సరోవర్ పథకంతో

# అద్భుతమైన పనులు

- ఉద్యాన పంటల సంరక్షణ కోసం పలు చెరువులు ఏర్పాటు - నీటిని వడిసి పట్టుకోవడానికి రైతులే పక్కా ప్రణాళికలు రూపకల్పన - భూగర్భ జలాల వృద్ధితో నీటిమట్టం పెరుగుదల- కలెక్టర్ హరినారాయణన్



బుడితిరెడ్డిపల్లిలో అమృత్ సరోవర్ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, కేంద్ర బృంద నోడల్ అధికారి ఉమా నందూరి తదితరులు

చిత్తూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: జిల్లాలో అమృత్ సరోవర్ పథకం కింద రైతులు అద్భుతమైన పనులు చేపట్టారని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టర్ హరి నారాయణన్ శుక్రవారం సాయంత్రం కేంద్ర బృంద నోడల్ అధికారి ఉమా నందూరితో కలిసి యాదమరి మండలం బుడితిరెడ్డిపల్లి గ్రామ పరిసరాల్లో నిర్మించిన అమృత్ సరోవర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో వర్షపు నీటిని వడిసి పట్టుకోవడానికి అమృత్ సరోవర్ పథకం ద్వారా రైతులే తమకు కావాల్సిన పథకాలను ఎంపిక చేసుకొన్నారన్నారు. తద్వారా రైతులు మంచి ఫలితాలను పొందుతున్నారన్నారు. కేంద్ర జాయింట్ సెక్రటరీ ఆఫ్ కల్చర్ ఉమా నందూరి రైతులతో మాట్లాడుతూ ఈ పథకం కల్ల కలిగే లాభాలను అడిగి తెలుసుకొన్నారు. దీనికి రైతులు సమాధానం ఇస్తూ గతంలో వర్షాలు లేక చాలా ఇబ్బందులు పడేవారమని గత మూడేళ్ళుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎన్నడు లేని విధంగా వర్షపు నీరు పొలాల్లోకి వచ్చి ఉద్యాన పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ఈ పథకం ద్వారా నీటికి ఒక చోట వడిసి పట్టి చెరువులకు నీరు పంపడం జరుగుతుందన్నారు. దీనివల్ల పంట పొలాల్లోకి నీరు వచ్చే ప్రమాదం వుండదన్నారు. అలాగే చెరువుల్లో నీరు నిల్వ వుండటం వల్ల బోర్లలో నీటి మట్టం పెరుగుతుందన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ గతంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు పంటలు కొల్పోయేవారని, ప్రస్తుతం ఈ పరిస్థితి లేకపోవడంతో నీటిని నిల్వ వుంచడంతో బోర్లలో నీటి మట్టం పెరుగి అందరికి ప్రయోజనం కలుగుతుందన్నారు. గతంలో జిల్లా వ్యాప్తంగా వెయ్యి ట్యాంకర్లలో నీటి సరఫరా జరిగేదని అయితే ప్రస్తుతం కేవలం ఆరు ట్యాంకర్ల ద్వారానే గ్రామాల్లో నీరు సరఫరా చేస్తున్నామన్నారు. పలు ప్రజా ప్రయోజనాల కోసం పనులు చేపట్టడం సంతృప్తిగా వుందని ఆయన ఆమెకు వివరించారు. అనంతరం ఆమె కాణిపాకంలో ఆవెన్యూ ప్లాంటేషన్, ఐరాల మండలం పాతపాళ్యంలో ఫ్లోరికల్చర్, తవణంపల్లి మండలం వేదగిరివానిపల్లిలో రూఫ్ వాటర్ స్ట్రక్చర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి చంద్రశేఖర్, మరో ఇద్దరు కేంద్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

# జవాబుదారితనంగా సచివాలయాలు

- సంక్షేమ పథకాలు లబ్దిదారుల ఇళ్ళకు చేర్చాలిన బాధ్యత సచివాలయ ఉద్యోగుల విధి
- అత్యంత బాధ్యతగా కార్యాలయ నిర్వహణ - కలెక్టర్



వరదరాజులపల్లి గ్రామ సచివాలయంను తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రజలకు నిత్యం జవాబుదారితనంగా గ్రామ, వార్డు సచివాలయాలు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హరి నారాయణన్ స్పష్టం చేశారు. కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం యాదమరి మండలం వరద రాజులపల్లి గ్రామ సచివాలయంను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు స్పందించి క్షేత్ర స్థాయిలో వాటిని పరిష్కరించడంతో పాటు కార్యాలయ నిర్వహణ బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు సచివాలయంలో ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సచివాలయంలో బయోమెట్రిక్ హాజరును పరిశీలించి వివిధ సంక్షేమ పథకాల లబ్దిదారుల జాబితాను ప్రజలకు కన్పించేలా అందుబాటులో వుంచాలని ఆదేశించారు. అలాగే సచివాలయ సిబ్బంది కార్యాలయ నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. సచివాలయంలో అర్హుల జాబితాతో పాటు అనర్హుల జాబితాను వుంచి అనర్హతకు గల కారణాలను తెలియజేయాలన్నారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ ప్రభుత్వ భవనాలను సత్వరం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు చిట్టిబాబు, ఎంపిడిఓ శివరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శివయ్య నేతి దీపాల వ్యాపారం...

# మళ్ళీ ప్రారంభం!

**శ్రీకాళహస్తీశ్వరునికి సుమారు రెండు నెలల తరువాత నేతి దీపాల వ్యాపారానికి అనుమతి లభించింది. శివయ్య భక్తులకు డాల్డా, పసుపు కలిపి దీపాలు విక్రయిస్తూ అధిక ఆర్జినకు అలవాటు పడిన వ్యాపారుల భరతం పట్టారు ఆలయ ఛైర్మన్, ఓ పోలీసు అధికారిణి. దీంతో కల్తీ నూనె దీనాలు వ్యాపారం అర్ధాతరంగా నిలిపోయాయి. తర్జన భర్జనల తరువాత స్థానిక నాయకులు, డాల్డా దీపాలకు బదులుగా, స్వచ్ఛమైన నేతి దీపాల విక్రయాలకు అనుమతించారు. అయితే నెయ్యిని కొందరు యువకులు సరఫరా చేయటానికి అనుమతించారు. వారు స్వచ్ఛమైన నేతిని వ్యాపారులకు విక్రయిస్తారు. వ్యాపారులు 50 గ్రాముల నెయ్యితో పాటు రెండు ప్రమిదల, పూజలు, గరిక, వత్తులు కలసి వంద రూపాయలకు మాత్రమే విక్రయించే ఒప్పందంతో అనుమతించారు. అయితే ఈ కట్టడి ఎంత కాలం కొనసాగుతుందనేది వేచి చూడాలి. వ్యాపారులు మాత్రం స్వచ్ఛమైన నేతి దీపాలు విక్రయిస్తే, తమకు గిట్టుబాటు కాదని లబోదిబో మంటున్నారు. దీని కన్నా దేవస్థానమే విక్రయిస్తే సరిపోతుంది కదా అనే వాదన కూడా వినబడుతుంది.ఏది ఏమైనా శివయ్య సన్నిధిలో మళ్ళీ నేతి దీపాల వెలుగులు వినాయక చవితి నుంచి ప్రారంభమైంది**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్ధలతో వచ్చే భక్తులను కొందరు వ్యాపారులు నకిలి నేతి దీపాలను కట్టబెట్టి వందలు వసూలు చేసుకుంటూ నిలువుదోపిడికి పాల్పడుతున్నారని పలు మార్లు వ్యాపారులకు హెచ్చరించినప్పటికి వినక పోవటంతో ఓ వైపు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మరో వైపు అర్బన్ సిఐ అంజూ యాదవ్ కల్తీ దీపాల వ్యాపారలనే మూయించారు. అయితే ఈ వ్యాపారం మీద ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు లబోదిబో మంటూ స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి వద్ద మొరబెట్టుకున్నారు. ఈఅంశానికి సంబంధించి నిరుపేద వ్యాపారుల సమస్యలను



పరిగణలోకి తీసుకున్న నాయకులు 'స్వచ్ఛమైన నేతి దీపాలను' విక్రయించుటకు నిర్ణయించారు. అలాగే నేతిని కల్తీల లేకుండా అందించటానికి ఓ యువకుని ఎంపిక చేసారు. ఆతని వద్దనే వ్యాపారులు నేతిని కొనుగోలు చేయాలని, ఆతను రూ.43లకు వ్యాపారులకు అందజేస్తారని, వ్యాపారులు రూ.100లకు పైగా విక్రయించకూడదనే నిబంధనలతో అనుమతించారు. ఒకటవ గేటు వద్ద సుమారు 50దుకాణాలు, రెండవ గేటు వద్ద 20 దుకాణాలు, మూడవ గేటు వద్ద మూడు దుకాణాలు ఉన్నట్లు గుర్తించారు. వారు జవాబుదారి తనంతో వ్యవహారించాలి. ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటారు.ఈ నిబంధనలతో అనుమతించారు. అయితే ఈ నిబంధనలు ఎంత కాలం నిలుస్తాయి? ఎన్ని దేవస్థానం కట్టడి చేస్తుందనేది డాలర్ల ప్రశ్నే!

**గిట్టుబాటు కాదు మొర్రో!**

సుమారు నెలన్నర రోజులుగా ఇక్కడి వ్యాపారులు ఆదాయాలు గణనీయంగా పడిపోయాయి.దాంతో వారు తమ బతుకు జీవనం పోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డితో మొరబెట్టుకున్నారు. సాధారణంగానే ఎవరైనా కష్టాలు చెబుతూ కన్నీళ్లు పెట్టుకుంటే స్పందించే శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి పట్ల ఔదార్యంతో వ్యవహరించారు. తనకు చెడ్డ పేరు రాకుండా భక్తులను మోసం చేయకుండా వ్యవహరించాలని సూచించారు.అధికారులతో చర్చించాలని సూచించారు. అయితే రెండు రోజులుగా నేతి దీపాల విక్రయాలు సాగుతున్నాయి. కానీ తమకు గిట్టుబాటు కాదని చెబుతున్నారు. నేతికి రూ.43లు, ఇతర వస్తువులకు కనీసం పాతిక రూపాయలు ఖర్చు అవుతుందని వాపోతున్నారు. అంటే మొత్తం ఖర్చు రూ.65 అవుతుంది.వందరూపాయలకు విక్రయిస్తే ఎంత లాభం వస్తుంది? ఇక ఒక గుమాస్తాను ఏర్పాటు చేసుకోవాలి ఆతనికి రూ.400 నుంచి 500ల కూలి చెల్లించాలి. బెంచి వేస్తే చాలు రూ.500లు చెల్లించాలి. కరెంటు ఖర్చులు ఇలా రక రకాల వ్యయాలుంటాయి. రోజుకు వంద దీపాలు అమ్మినా తమకు ఏమి మిగులుతుందని ప్రశ్నిస్తున్నారు. మరి కట్టడితో ఎంత కాలం అమలు జరుగుతుందో వేచి చూడాలి.

# 27నుంచి గోవిందుని బ్రహ్మోత్సవాలు

-20న కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం -26న అంకురార్పణ



తిరుమల,సెప్టెంబర్ 2ప్రభాతవార్తప్రతినిధి: ఈ ఏడాది ఏడుకొండల వెంకన్న బ్రహ్మోత్సవాలను భక్తుల మధ్య జరిపించేందుకు టిటిడి సిద్దమైంది. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తోంది. తొమ్మిదిరోజులు జరిగే దేవుని బ్రహ్మోత్సవాలకు టిటిడి అన్ని ఏర్పాట్లుచేస్తోంది. ఈనెల 27న మొదలయ్యే శ్రీవారి ఉత్సవాల్లో తొలివాహనంగా పెద్దశేషవాహనసేవ జరుగుతుంది. వరుసగా రెండవరోజు నుంచి తొమ్మిదవరోజు వరకు చక్రస్నాన మహోత్సవంతో అక్టోబర్ 6వతేదీ ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా 27న సాయంత్రం ధ్వజారోహణం, అక్టోబర్ 1న గరుడసేవ, 2వతేదీ సాయంత్రం స్వర్ణరథం, 4న రథోత్సవం, 5న చక్రస్నానం ప్రధాన ఘట్టాలు. ఈ ఉత్సవాలకు శ్రీకారంగా ఈనెల 20న మంగళ వారం కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం, 26న సాయంత్రం అంకురార్పణ జరుగుతుంది. బ్రహ్మోత్స వాలకు విచ్చేసే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి మీడియాకు వెల్లడించారు.

## చెరగని జ్ఞాపకాలతో మహానేతకు...

# ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆశ్రు నివాళి



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజానికాన్ని వదిలి 13 సంవత్సరాలైన మహానేత జ్ఞాపకాలు ప్రజల గుండెల్లో సుస్థిరంగా ఉన్నాయని ప్రభుత్వ విఫ్, తుడా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైయస్సార్ జిల్లా ఇడుపులపాయలో వైయస్సార్ సమాధి వద్ద ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే చెవిరెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. వైయస్సార్ ప్రజా సంక్షేమ పథకాలు యధాతథంగా అమలు చేస్తూ సి.యం. జగన్ ప్రజారంజకపాలన సాగిస్తున్నారని కొనియాడారు.

## మరణం లేని మహానేత వైఎస్ఆర్ :పవిత్రారెడ్డి

రేణిగుంట, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



మరణం లేని మహానేత సంఘ సంస్కర్త దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అని రేణిగుంట మండల వైకాపా ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి నొక్కి వక్కాణించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వైకాపా నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఉదయం అత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రసాద్ తదితరులతో కలసి వైఎస్ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రేణిగుంట బస్టాండ్ సర్కిల్ వద్ద నివాళులర్పించిన వారిలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, రేణిగుంట వైకాపా పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, కో-ఆప్షన్ మెంబరు సుభాన్ రాజా, రేణిగుంట సర్పంచ్ నాగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, వైకాపా సీనియర్‌నాయకులుదయాకర్‌రెడ్డి,త్రివిక్రమ్,పురుషోత్తంరెడ్డి,వైకాపా మండల ముస్లిం మైనారిటీల అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, కార్యదర్శి షబ్బీర్ అహ్మద్, సైకిల్‌షాపు అలీ, ఆషా రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొండంత బొజ్జ గణపయ్యకు గోరంత పూజ

రేణిగుంట, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



రేణిగుంట బుగ్గ వీధిలో విఘ్నేశ్వర నిమజ్జన కమిటీ ఏర్పాటుచేసిన శివుడు రథసారధిగా నందులు రథాన్ని లాగుతుండగా స్వర్ణ రథంపై ఆశీనులైన బొజ్జ గణపయ్య విగ్రహం పలువురుని ఆకట్టుకుంది. ఎంతో మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంవత్సరానికి బొజ్జ గణపయ్య వీడ్కోలు పలికి టాటా చెబుతూ బైబై అంటూ ఊరేగింపుగా పురవీధుల్లో ఊరేగుతూ నిమజ్జనానికి బయలుదేరారు.

## నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు : రూరల్ సీఐ

రేణిగుంట, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



వినాయక మండపాల వద్ద నిమజ్జనం చేస్తున్నప్పుడు, ఊరేగింపుల్లో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఆరోహణరావు హెచ్చరించారు. రూరల్ సీఐ కార్యాలయంలో ఆయన ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ రూరల్ సర్కిల్ గాజులమండ్యం, వడమాలపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చాలా చోట్ల వినాయక మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్టించారన్నారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, రేణిగుంట డీఎస్పీ రామచంద్ర ఆదేశాల మేరకు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్ఐలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారన్నారు. ముఖ్యంగా విద్యుత్ ఘాతాలకు ఎవరూ గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు ఎస్ఐ ధర్మారెడ్డి ఉన్నారు.

## రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం

విజయపురం, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :

స్వర్గీయ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపిపి జమున పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో విజయపురం పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం కూడలిలో రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్బికె ఛైర్మన్ గుణశేఖరరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు హరిబాబునాయుడు, వైస్ ఎంపిపి మంజు బాలాజీ, జడ్పీటిసి సభ్యురాలు రేవతి, సర్పంచ్‌లు కుమార్, సుబ్రమణ్యం, మురళీకృష్ణారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శివరాజు, కుమార్‌రెడ్డి, జిల్లు దాసు, రాజేంద్రన్, కుప్పయ్య, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ అడుగజాడల్లో నడుద్దాం..!

తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అడగుజాడల్లో నడవడానికి కృషి చేద్దామని తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. వైసిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ 13వ వర్ధంతి వేడుకలు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి, డివిజినల్ కనీనర్లు వెంకట రెడ్డి, భాస్కర్ రెడ్డి, చిట్టిబాబు నాయుడు, సర్పంచ్‌లు గణపతి రెడ్డి, హిమాల్ రెడ్డి, నాయకులు సిద్దారెడ్డి, బీకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : ఎంపిపి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



గ్రామాలలో భూ సమ్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం అనుప్పల్లిలో రెవెన్యూ సదస్సులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఢిల్లీరాణి, తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ కృష్ణవేణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ విజయ గణపతి రథోత్సవం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపల్ పరిధిలోని పిళ్లారిపట్టు గ్రామంలో వెలసిన శ్రీ విజయ గణపతి ఆలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సందర్భంలో భాగంగా స్వామివారిని రథంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన తిరుపతి ఇస్కమ్ టాక్స్ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎన్.మురళి, ఎన్.మంజుల దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈవో తనిఖీ

పుత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



పుత్తూరు మండలంలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈవో తిరుమలరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు సీఆర్పీ శైలజ, ప్రధానోపాధ్యాయురాలు భారతి, సర్పచర్ విరిత, దేవేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

పుత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



పుత్తూరు మండలంలోని అన్ని సచివాలయాల్లోనూ శుక్రవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తడుకు గ్రామంలో వైసీపీ నాయకులు, వీఎస్ఎస్ పురం, గొల్లపల్లి గ్రామాల్లో దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో, గోపాలకృష్ణాపురంలో కో-ఆప్షన్ మెంబరు రామ్‌బత్తయ్య ఆధ్వర్యంలో కేవీఆర్ పురం లోకనాథం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో అన్నదానాలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, సచివాలయసిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ ఫలాలు

వెదురుకుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అర్హులందరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు మంజూరుచేయడంజరుగుతుందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బట్టే సుబ్రమణ్యంతెలిపారు. సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోటూగారి లలిత భాస్కర్, డీడీవో ధనలక్ష్మీ, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీలో నేటినుంచి పిజి సెట్ ప్రవేశ పరీక్షలు

కుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :

ద్రవిడ వర్సిటీలో పిజి సెట్ ఎంట్రెన్స్ పరీక్షలు ఈనెల 3,4,7,10,11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పరీక్షలకు సంబంధించి వర్సిటీలో పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా జరిగే ఈ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ద్రవిడ వర్సిటీకి పిజి ఎంట్రెన్స్ టెస్ట్ సెంటర్‌ను తెచ్చుకున్నామని వర్సిటీలో పిజి సెంటర్ ద్వారా పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## ద్రవిడ వర్సిటీ విద్యార్థినికి స్వాతంత్ర్య దినోత్సవ మెడల్

గుడుపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :

ద్రవిడ వర్సిటీ ఎన్‌సిసి కేడెట్ శిల్ప దేశరాజధాని ఢిల్లీలో జరిగిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పెరేడ్‌లో పాల్గొని మెడల్, బ్యాడ్జ్ సాధించినట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ తెలిపారు. జిల్లాలో తొలిసారి వర్సిటీకి చెందిన విద్యార్థిని శిల్ప మెడల్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా శిల్పను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్‌సిసి విభాగం ఇన్‌చార్జ్ ప్రసాద్‌నాయక్, మణివేల్‌కుమార్ పాల్గొన్నారు.

## అవయవదానం చేయండి..జనసేన

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



అవయవదానం చేయండి.. చిరస్థాయిగా నిలచిపోండని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుతకోట అన్నారు. శుక్రవారం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అవయవదానం చేయండంటూ నాలుగుమాడావీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు అవయవదానంపై అవగాహన కల్పిస్తూ జనసేన జెండాలు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో ఎపి బిసి సంఘ అధ్యక్షులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసనశంకరరావు విచ్చేశారు. ఆయనకు స్థానిక బిసినాయకులు,నాయిబ్రాహ్మణసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట.చంద్రశేఖర్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు సురేంద్రముదిరాజ్, న్యాయవాది కాకి.చిన్నఅంకయ్యలు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనంతో పాటు పూజలు చేయించుకున్నారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసా దాలను శేషవస్త్రాలను అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందుకున్నారు.

## మరపురాని మహానేత దివంగత డాక్టర్ వైఎస్ఆర్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



మరపురాని మహానేత దివంగత డాక్టర్ వైఎస్ఆర్ అని తిరుపతి జిల్లా వైఎస్ఆర్‌సిపి బిసిసెల్ అధ్యక్షులు మాజీ ఆప్కోడైరెక్టర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మిద్దెలహరి అన్నారు. శుక్రవారం ఆయన 13వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాజ్యాంగనిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సర్కిల్‌నందు వైఎస్ఆర్‌చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రమేకాకుండా ప్రపంచమే గర్వించదగిన వ్యక్తి గుర్తింపు పొందిన వ్యక్తిగా ప్రజాదరణ పొందారని అలాంటి మహానేత మనకు దూరమవడం శోచనీయం అన్నారు. పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. నేడు ఆయన మార్గంలోనే తనయుడు జగన్‌కూడా నడుస్తు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జయదేవన్‌గిరి, తీగలచంద్ర, మునిలక్ష్మి, కిరణ్మయి,వెంకటేష్, ఇసుకమట్లబాల, దావాలగిరి, ప్రభాకర్, సుధాకర్, సుధాకర్, చెన్నయ్య, రాఘవులు, శేఖర్, జగ్గ, వెంకటేష్, రవీంద్ర, బాబు, కుమార్, సాయి, శివ, సూరి తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి ప్రదాత డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్‌రెడ్డి

-తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, సెప్టెంబర్2 ప్రభాతవార్త:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్.రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తిదాత అని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైయస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని దుర్గసముద్రం అక్షయక్షేత్రంలోపండ్లు, బ్రెడ్స్,అన్నదానం చేసారు. వైయస్సార్ పాలన జరిగిన ప్రజా సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్నారు. వైకాపా రాష్ట్ర విద్యార్ధి నాయకులు ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్ష ఫలితాల్లో వేదవ్యాస విద్యార్థుల ప్రతిభ

నారాయణవనం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :

ఎస్వీ యూనివర్సిటీ అధికారులు విడుదల చేసిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనపరిచినట్లు ప్రిన్సిపాల్ ఎన్ అనిల్‌కుమార్ తెలిపారు. పుత్తూరు డివిజన్ పరిధిలో వేదవ్యాస విద్యార్థులు విశేష ప్రతిభను కనపరచడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్సీ(ఎంపిసిఎస్) గ్రూపులో వి కళ్యాణి 9.71శాతం, ఎంఎస్‌సిఎస్ గ్రూపులో వి భారతి 9.36, ఎంపిసి గ్రూపులో కె నవ్యశ్రీ 9.16, ఎంపిసిఎస్ గ్రూపులో ఎం భవాని9.00, బిజడ్‌సిలో హిమశ్రీ9.01 మార్కులను సాధించినట్టు చెప్పారు. అలాగే బికాం(సిఎ)లో జి ఇందిర 9జ51, ఎన్ కుమారి 9.23, ఇ సంగీత 9.19, కె హేమలత 9.03, ఎ పావని 9.00, సి లైలా 9.00, జె రషిదా 9.00 శాతం మార్కులను సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ సి బాలసరస్వతి, సిబ్బంది, అధ్యాపకులు అభినందించారు.

## అంగన్‌వాడీ ఖాళీ పోస్టులకు ధరఖాస్తులు చేసుకొండి :సిడిపిఓ

నారాయణవనం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :

నారాయణవనం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా వున్న పోస్టులకు అర్హులైనా వారు ధరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్ శంకరమ్మలు తెలిపారు. చివరి తేదీ ఈనెల 8వ తేది సాయంత్రం 5గంటల లోపు ధరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మాట తప్పని మడమ తిప్పని నేత రాజశేఖర్‌రెడ్డి

కార్వేటినగరం,సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



మాటతప్పని మడమతిప్పని నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఎంపిపి లతాబాలాజీ అన్నారు. కార్వేటినగరం లోని కసవరాజభవనం సముదాయంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలువేసినివాళులుఅర్పించారు. అనంతరం గాంధీ ఆశ్రమంలోని వృద్దులకు పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి మణెమ్మ,రాష్ట్రయువత కార్యదర్శి ధనంజయరెడ్డి,సర్పంచ్ ధనంజ యవర్మ, మార్కెటింగ్‌చైర్మన్‌కృష్ణయాదవ్,కో-ఆప్షన్‌మెంబరుపట్నంప్రభాకర్,దేశమ్మ,మోహనమ్మ, శేఖర్‌రాజు,గోపి, వెంకటేష్,పురుషోత్తంరాజు,ధనశేఖర్‌వర్మ,శివప్రకాష్,ధనరాజ్,కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

## మొదలు కానున్న రీసర్వే :ఆర్డీఓ

కార్వేటినగరం,సెప్టెంబరు 2 ప్రభాతవార్త:

నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో త్వరలోనే రీసర్వే మొదలుకానున్నట్లు నగరి ఆర్డీఓ సుజన తెలిపారు. కార్వేటినగరం తాహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. సమస్యలున్న భూములను మళ్ళీ రీసర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్వేటినగరం పంచాయితి పరిధిలోని సుద్దగుంట గ్రామంలో కులదృవీకరణపై పరిశీలించను న్నట్లు చెప్పారు. ఆర్డీఓ వెంట తాహశీల్దార్ అమరనాధ్,డిటి లక్ష్మీపతి,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించాలి

నింద్ర,సప్టెంబర్ 2 ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు అర్హులైన వారిందరి అందించాలని నగరి నియోజకవర్గ వైకాపా సినియర్ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు.శుక్రవారం మండలంలోని పాదిరిలో గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమం యంపిపి దీపజలందర్‌రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈకార్యక్రమంలో యంపిడిఓ వేణు,తహశీల్దారు అమరేంద్రబాబు, ఎపియం చంద్రకళ,వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ,హౌసింగ్ ఎఇ శ్రీధర్‌రాజు, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణరెడ్డి,యంపిటిసి విజేష్,నాయకులు సంపత్, మహేష్, రాము,దాము, వీరయ్యనాయుడు,తదితరులు పాల్గొన్నారు

## రాజన్న స్ఫూర్తితో జగనన్న పాలన : ఎంపిపి

చంద్రగిరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి (రాజన్న) పాలనను స్ఫూర్తిగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి (జగనన్న) పాలన సాగిస్తున్నారని తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టవ్‌క్లాక్ వద్ద వైఎస్ఆర్ 13వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ముడిపల్లి సురేష్ రెడ్డి, వైస్ చైర్మన్ బండారు హేమచంద్రారెడ్డి, నాయకులు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, కొటాల చంద్రశేఖర్ రెడ్డి, చేగు గోవర్ధన్ గుప్తా, మల్లం చంద్రమౌళి రెడ్డి, మస్తాన్, ముద్దికుప్పం రామమూర్తి, కొత్తపాటి నాధమునిరెడ్డి, కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, కొత్తపాటి మనోహర్ రెడ్డి, కొత్తపాటి హరి, సూరి, నజరత్, తదితరులు పాల్గొన్నారు.

## సెమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు

చంద్రగిరి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



రెవెన్యూ విభాగంలో తలెత్తే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తు న్నట్లు తహశీల్దార్ శిరీషా తెలిపారు. మండల పరిధిలోని భీమవరం సచివాలయంలో భీమవరం, చిన్నరామాపురం కొండ్రెడ్డికండ్రిగ పంచాయతీ ప్రజలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు కందులవారిపల్లి సచివాలయంలో శేషాపురం, బి.కొంగరవారిపల్లి పంచాయతీ ప్రజలకు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిటిసిలు బోస్ చంద్రారెడ్డి, రాజయ్య, ఆర్ఐలు మోహన్‌రెడ్డి, అమృత, సర్వేయర్ పురుషోత్తం రెడ్డి, ఏఈ రాములు, విఆర్ఓ వెంకన్న నాయుడు, సెక్రటరీ గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు పెంపొందించేందుకే ఉపాధిహామీ పనులు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



భూగర్భ జలాలను పెంపొందిం చేందుకే ఉపాధిహామీ పనులు చేపడుతున్నట్లు ఎంఓఆర్‌డి జాయింట్ సెక్రటరీ దండూరి ఉమ అన్నారు. శుక్రవారం పుల్లమ నాయుడు కండ్రిగ, సి.కె.పల్లి పంచాయతీలలో ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. పిళ్ళారికోన చెరువులో నూతనంగా నిర్మించిన అమృత్ సరోవర్ కొలనును, ఎన్ఆర్ఈ జిఎస్‌లో రైతులు నాటుకున్న కొబ్బరి, మామిడి మొక్కలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిడి శ్రీనివాస్ ప్రసాద్, ఏపిడి పద్మలత, ఏపిఓ హంసవేణి, టిఏ సుదర్శన్, ఏఈ మమత, ఎఫ్ఏలు ఇరగం రెడ్డి, గిరిదర్ రెడ్డి, ప్రభాకర్, పురుషోత్త, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## డప్పు కళాకారులకు పింఛన్ల పంపిణీ

పుత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగానూతనంగామంజూరైనడప్పుకళాకారుల పింఛన్లను శుక్రవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా మంజూరైన 12 డప్పు కళాకారులు పింఛన్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు ఉపయోగకరంగా సేంద్రియ ఎరువులు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



రైతులకు ఉపయోగకరంగా రామకృష్ణాపురం గ్రామంలోని చెత్తతో సంపద తయారీ కేంద్రం నిలుస్తోందని తహసీల్దార్ సుబ్రహ్మణ్యంఅన్నారు.శుక్రవారంఆయనతోపాటు పలువురు అధికారులు రామకృష్ణాపురంలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, ముని నరేష్‌కుమార్, హరిత, వైసీపీ నాయకుడు దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నక్షత్ర ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పొదుపు చేయండి

పుత్తూరురూరల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతనంగా ప్రవేశపెట్టిన నక్షత్ర డిపాజిట్ స్కీమ్‌లో పొదుపు చేసి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోండని పుత్తూరు డీసీసీబీ మేనేజర్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. డిపాజిట్ ద్వారా జనరల్ సిటిజన్స్‌కు 6.75 శాతం, సీనియర్ సిటిజన్స్‌లు 7.25 శాతం వడ్డీ తమ బ్యాంకు అందిస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్ కాలపరిమితి ఈ నెల 1వ తేదీ నుంచి ఈ నెల 17వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందన్నారు.

## మాజీ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

కేవీబీ పురం, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర హిస్టరీ అకాడమి డైరెక్టర్ మండల వైసీపీ పార్టీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, మండల ఎంపీపీ లక్ష్మినందకుమార్, బాబుయాదవ్, జడ్పీటీసీమూర్తిమునెమ్మ,సుబ్బయ్య,మండలకో-ఆప్షన్ మెంబరు జాకీర్, హుస్సేన్, బీసీసెల్ అధ్యక్షుడు హరిబాబురెడ్డి, సర్పంచ్ గిరి, ఎంపీటీసీ అయ్యప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీడేవిడ్,ఎంపీపీలుసరస్వతి,కేరళ శ్రీనివాసులు, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరత్నం పాల్గొన్నా రు.

## మహా వ్యక్తి దివంగత రాజశేఖర్‌రెడ్డి

కేవీబీ పురం, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలోని భారత్ గ్యాస్ కంపెనీలో మాజీ ముఖ్యమంత్రి దివంగత రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి రాష్ట్ర ముద్దిరాజ్ సంఘం డైరెక్టర్ తెరణి ధనంజయరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, మాజీ మండల కో-ఆప్షన్ మెంబరు కె.ఎన్.చెంచయ్యశెట్టి, వల్లూరుపాళెం ఎంపీటీసీ గోనెరి మోహన్‌నాయుడు, ప్రవీణ్, మునస్వామి, వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం 68వ వ్యవస్థాపక దినోత్సవం సంబరాలు

తిరుపతి (క్రీడా), సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ 68వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య రాజారెడ్డి, రెక్టార్ ఆచార్య శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, బోధనేతర సంఘ అధ్యక్షుడు పికె సుబ్రమణ్యం, కార్యదర్శి సుబ్రమణ్యం, చంద్రయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన కూచిపూడి నాట్యం

తిరుపతి (క్రీడా), సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :

వినాయక చవితి సందర్భంగా ఇస్కాన్ టెంపుల్‌లో జరిగిన కూచిపూడి నాట్యం నటరాజ సూర్యాలయ విద్యార్థులు చాతుర్య సిరి, వారి పుత్రిక డాక్టర్ సురేష్, డాక్టర్ కవిత పుత్రిక పర్ణిక, కృతి, జ్ఞాన ప్రసున్నాంబ తదితరులు నాట్య ప్రదర్శన చేసారు.

## పోటీ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వైష్ణవి

తిరుపతి (విద్య), సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో సిఇసి ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న ఈగ వైష్ణవి వివిధ పోటీ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఏపి డిఈఈ సెట్ 2022లో రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు, లాసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 184వ ర్యాంకు, క్లాట్‌లో జాతీయ స్థాయిలో 2,500 ర్యాంకులు సాధించింది. ఇంటర్మీడియట్ సిఇసిలో కూడా 935 మార్కులతో కళాశాలలో తృతీయ స్థానం సంపాదించింది. ఇంటర్మీడియట్ పాఠ్యాంశాలతో పాటు పోటీపరీక్షలతో అతి తక్కువ సమయంలో మంచి ర్యాంకులు సంపాదించిన వైష్ణవిని కళాశాలఅధ్యక్షులుడా.భువనేశ్వరిదేవి,ఉపాధ్యక్షులు ప్రియవర్ధన్ బాబు,అధ్యాపక అభినందనలుతెలిపారు.

## సౌత్ జోన్ జూడో బాలికలకు రాజేష్ అభినందనలు

తిరుపతి(క్రీడా), సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :

కేరళ, త్రిస్సూర్ 03 నుంచి 05 వరకు జరుగు జూనియర్ సీనియర్ ఖేలో ఇండియా సౌత్ జోన్ జూడో పోటీలకు చిత్తూరు జిల్లా బాలికల జట్టు బయలుదేరి వెళ్ళింది. జిల్లా గౌరవాధ్యక్షులు రాజేష్, కార్యదర్శి, కిరణ్ కుమార్‌లు బాలికలకు అభినందనలు తెలిపారు. మెడల్ సాధించిన క్రీడాకారిణికి నగదు బహుమతి అందిసానని ఉపాధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు.ఎంపికైనబాలికలునేత్రా,అంజలి,సిరిని, కళ్యాణి, ఐశ్వర్య,జువేరియ,లక్ష్మిప్రసన్న,లావణ్య,లలిత,హేమ,వైష్ణవిలు,మేనేజర్‌గాపియిటిసైలజలుబయలేరారు.

## వినాయక నిమజ్జన కమిటీ మోటారుసైకిల్‌ర్యాలీ

తిరుపతి,సెప్టెంబర్ 2ప్రభాతవార్త:



ఆధ్యాత్మికనగరం తిరుపతిలో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి, భక్తిభావంతో నిత్యపూజలు చేస్తున్న నిర్వాహకులు విగ్రహాల నిమజ్జనానికి ఆదివారం ప్రణాళికతో రావాలని వినాయక నిమజ్జన కమిటీ కోరింది. విగ్రహాల నిమజ్జనంపై నిర్వాహకులకు సూచనలు చేస్తూ జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాలతో కమిటీ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించింది. రూట్‌మ్యాప్ ప్రకారం వినాయకసాగర్‌కు తరలిరావాలని కమిటీ నాయకులు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, భాస్కర్‌నాయుడు, గుండాల గోపీనాధరెడ్డి, మంజునాథ్ నిర్వాహకులకు విజ్ఞప్తిచేస్తూ తుడ మైదానం నుంచి నగరంలో ర్యాలీ చేపట్టారు.

## ప్రజా హృదయాల్లో సజీవంగానే డాక్టర్ వైయస్సార్

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:



డాక్టర్ వైయస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజా హృదయాల్లో సజీవంగా ఉన్నారని సాయినగర్ గ్రామ సర్పంచ్ డివి రమణ పేర్కొన్నారు.శుక్రవారం డాక్టర్ వైయస్సార్ వర్ధంతిని పురస్కరించుకునిసాయినగర్‌లోఅన్నదానకార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ టి.సోమశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీరాములురెడ్డి, హేమలత, వినోద్, చెన్నారెడ్డి, మాధవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

**-సి.గొల్లపల్లిలో వైయస్సార్ వర్ధంతి** తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీలో డాక్టర్ వైయస్సార్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుపతిరూరల్ ఉప మండలాధ్యక్షుడు విదుదల మాధవరెడ్డిఆధ్వర్యంలో వైయస్సార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**-పెరుమాళ్ళపల్లి వైసాయస్సార్ వర్ధంతి** పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం వైయస్సార్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్సార్ విగ్రహనికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్, వైకాపా సీనియర్ నేత కొత్తపాటి మునీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**-పేరూరులో వైయస్సార్ వర్ధంతి వేడుకలు** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉప సర్పంచ్ పరంధామరెడ్డి ఆధ్వర్యంలో వైయస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు.

## పండ్లు పంపిణీ

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :



దివంగతి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై అక్షయక్షేత్రంలోని అనాథ పిల్లలకు పండ్లు, బ్రెడ్లు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి యువజన సంఘాల నేతలు అశోక్‌రెడ్డి, భార్గవ్, శివారెడ్డి, మణి, వెంకటేశ్వర్లు, నరేష్‌కుమార్, ముబారక్, భాస్కర్ రాయల్, శంకరయ్య, పలువురు విద్యార్థులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాడ వాడల్లో నిమజ్జనానికి బయలుదేరిన వినాయకులు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మూడవ రోజు వినాయక చవితి సంబరాలుమిన్నుముట్టాయి. వాడ,వాడల్లో యువకులు సామాజిక సేవా కార్యక్రమాల్ని భారీ ఎత్తున నిర్వహించారు.ఈ నేపధ్యంలో శుక్రవారం పట్టణ నడిబొడ్డులోని పిట్టల వారి సందులో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాల కార్యక్రమాలను ఆ ప్రాంతానికిచెందిన చిన్నా ఏర్పాటు చేసారు.ఆయన సహచరులు సహకరించగా వినాయకుని విగ్రహం వద్ద యువకుల ఉత్సాహాలు ఉరకలు వేయగా ఆడుతూ పాడుతూ గడిపారు. కాగా శుక్రవారం

